సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 13 । అక్టోబర్ । 2025



అప్రదక్షిణ మార్గంలో క్యూలైన్
ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో అప్రదక్షిణ మార్గంలో దర్శనం క్యూలైన్ల నిర్మాణాలు చేపట్టడం విమర్శలకు తావిస్తోంది. 8లో



పూత దశలో జాగ్రత్తలు
జీడిమామిడి తోటల్లో పూత ప్రారంభ దశలో ఉంది. ఈ పరిస్థితుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. 8లో



మందుబాబులకు అడ్డాగా..
ద్వారకాతిరుమలలోని నృసింహ సాగరం (పుష్కరణి) అధ్వానంగా ఉంది. రాత్రిళ్లు మందుబాబులకు అడ్డాగా మారింది. 8లో

న్యూస్‌రీల్

ఎన్‌ఎంఎంఎస్‌కు ఆన్‌లైన్ శిక్షణ



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ గోపీమూర్తి

భీమవరం: ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల కోసం శిక్షణ ఇచ్చేలా 50 రోజుల పాటు ఉచిత ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించనున్నట్టు ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వీరవల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఉచిత ఆన్‌లైన్ పరీక్షల యాప్ బ్రోచర్‌ను ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ డిసెంబర్ 7న నిర్వహించే ఎన్ఎంఎంఎస్ పరీక్షకు నవంబర్ 30 వరకు ఉచిత ఆన్‌లైన్ టెస్టులు నిర్వహిస్తామన్నారు. మొబైల్ యాప్‌ను గూగుల్, మొబైల్ ప్లే స్టోర్ నుంచి తెలుగు ఎగ్జామ్ అని సెర్చ్ చేసి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 95333 34463లో సంప్రదించాలని కోరారు.

17న జిల్లాస్థాయి యువజనోత్సవాలు

భీమవరం(ప్రకాశంచౌక్): జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాస్థాయి యువజనోత్సవాలను ఈనెల 17న తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో నిర్వహించనున్నట్టు కలెక్టర్ సీహెచ్ నాగరాణి తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చూపిన వారికి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. అలాగే ఈనెల 15న భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎగ్జిబిషన్ ఆఫ్ సైన్స్ మేళా పోటీలను నిర్వహించనున్నట్టు చెప్పారు. యువజనోత్సవాల్లో భరతనాట్యం, కూచిపూడి, జానపద నృత్యం (సోలో), వెస్ట్రన్ డాన్స్ (గ్రూపు) పోటీలు ఉంటాయన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు 15 ఏళ్ల నుంచి 29 ఏళ్ల వయసున్న వారు అర్హులని తెలిపారు. నవంబర్ రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 9441446999, 94909 38012, 7075230609 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు పీజీఆర్ఎస్
భీమవరం కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్టు కలెక్టర్ నాగరాణి తెలిపారు. అలాగే డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిలో కూడా కార్యక్రమం నిర్వహిస్తామని, ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పించాలని కలెక్టర్ సూచించారు.

ధాన్యానికి బోనస్ ప్రకటించాలి

ఏలూరు (టూటౌన్): రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అన్నే భవనంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధానాల ఫలితంగా వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ నష్టాలతో అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే విధానాలు రాకపోతే రైతు మునుగడే ప్రశ్నార్థకంగా మారిపోతుందన్నారు. పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధరలు కల్పించాలని, ఈ మేరకు చట్టం తీసుకురావాలని కోరారు.

వైద్యసేవ.. అందని తోవ

అనారోగ్యశ్రీ
- కొనసాగుతున్న ఆరోగ్యశ్రీ సేవల బంద్
- ఓపీ చూడని నెట్‌వర్క్ ఆస్పత్రులు
- సాధారణ వైద్యం అందని వైనం
- జిల్లాలో 28 నెట్‌వర్క్ ఆస్పత్రులు
- ప్రజల కష్టాలు పట్టని ప్రభుత్వం

భీమవరానికి చెందిన ఓ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రి వైద్యుడు మాట్లాడుతూ బకాయిలు పెరిగిపోవడంతో ఆస్పత్రి నిర్వహణ కష్టంగా మారింది. దీనిపై పలుమార్లు ఆరోగ్యశ్రీ అధికారులతో మాట్లాడినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. దీంతో చేసేదీ లేక ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేశాం. గత ప్రభుత్వంలో ఇబ్బందులు లేకుండా రెండు, మూడు నెలలకు బిల్లులు రావడంతో ఆస్పత్రి నిర్వహణ సులభంగా జరిగేది.

భీమవరానికి చెందిన ఓ వృద్ధురాలు నేత్ర సమస్యతో పట్టణంలోని ఓ నెట్‌వర్క్ ఆస్పత్రికి వెళ్లింది. ఆరోగ్యశ్రీలో ఉచితంగా చూడటం లేదని తెలిసి రూ.500 చెల్లించి ఓపీ కార్డు తీసుకుని డాక్టర్‌ను సంప్రదించింది. అయితే అనంతరం వైద్యసేవలకు ఖర్చుచేయలేక ఆరోగ్యశ్రీ వచ్చిన తర్వాత చూపించుకోవచ్చని ఉచిత సేవల కోసం వేచి చూస్తోంది.

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లావ్యాప్తంగా ఎన్టీఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ) నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఉచిత సేవల బంద్ కొనసాగుతోంది. ప్రభుత్వం ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించాలని, ప్యాకేజీలు పెంచాలంటూ ఈనెల 10 నుంచి ఆస్పత్రి యాజమాన్యాలు ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేశాయి. దీంతో ఉచిత సేవలు అందడం లేదు. కేవలం అత్యవసర కేసులను మాత్రమే చూస్తామని, ఓపీ, ఇతర వైద్య సేవలు చేసేదేమీ లేదని ఆస్పత్రి యాజమాన్యాలు స్పష్టం చేశాయి. దీంతో జిల్లాలోని 28 నెట్‌వర్క్ ఆస్పత్రులకు గాను మూడు ఆస్పత్రులు, రెండు డయాలసిస్ యూనిట్లలో మినహా ఆరోగ్యశ్రీ పథకంలో ఉచితంగా సేవలు అందడం లేదు.

'ఓపీ'క పట్టలేక..

జిల్లాలోని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఓపీ కార్డు రూ.400 నుంచి రూ.500 వరకు ఉంది. ఇది కాకుండా ఆరోగ్య పరీక్షలు, మందులకు వేల రూపాయలు ఖర్చు చేయాలి. ఉచిత సేవలు నిలిచిపోవడంతో సాధారణ వైద్యం కోసం వెళ్లే రోగులు సొంత సొమ్ములు చెల్లించాల్సి రావడం భారంగా మారింది. అలాగే అత్యవసర వైద్యం కాకున్నా శస్త్రచికిత్సలు చేయించుకోవాల్సి వారు ఉచిత సేవల కోసం వేచిచూస్తున్నారు. ఉదాహరణకు ఓ వ్యక్తి కాలుకు ఆపరేషన్ చేయించుకోవాలి. సాధారణంగా ఆస్పత్రిలో ఓపీ చూపించిన తర్వాత వైద్యుడి శస్త్రచికిత్స కోసం ఆరోగ్యశ్రీలో సిఫార్సు చేస్తే అప్రూవల్ వచ్చిన వెంటనే ఆపరేషన్ చేస్తారు. అయితే ప్రస్తుతం సాధారణ వైద్యసేవలు నిలిచిపోవడంతో ఇలాంటి కేసుల్లోనూ వైద్యం అందక పలువురు ఇబ్బంది పడుతున్నారు.



భీమవరంలో ఆరోగ్యశ్రీ సేవలు బంద్ చేసిన శ్రీలక్ష్మి ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న హెల్ప్‌డెస్క్

కూటమి పాలనలో ఇది రెండోసారి..

జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లోనూ పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. వైద్యుల కొరత, పీహెచ్‌సీ వైద్యుల సమ్మె వంటి సమస్యలతో సేవలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. దీంతో ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రుల బాట పట్టాల్సి వస్తోంది. అలాగే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆరోగ్యశ్రీ ఆస్పత్రులు బంద్ చేయడం ఇది రెండోసారి. ఐదు నెలల క్రితం బిల్లుల కోసం సేవలు నిలిపివేయగా తాజాగా మరోసారి సమ్మెబాట పట్టాయి. ఆయా ఆస్పత్రులకు రూ.40 లక్షల నుంచి రూ.కోట్ల మేరకు బకాయిలు ఉన్నట్టు తెలిసింది.

ప్రజారోగ్యంతో చెలగాటం

ఆరోగ్యశ్రీ సేవలను అందించడంలో కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతోందని పలువురు మండిపడుతున్నారు. నెట్‌వర్క్ ఆస్పత్రులకు బిల్లుల చెల్లింపులో అలసత్వం వహిస్తూ పేద, మధ్యతరగతి ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టిందని అంటున్నారు. ప్రభుత్వం పర్యటనలకు, అట్టహాసాలకు, ప్రచారాలకు రూ.కోట్లు ఖర్చు చేస్తూ.. పేదల ఆరోగ్యానికి సంబంధించి విషయాలపై అశ్రద్ధ చేయడం తగదని వాపోతున్నారు.

ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగించాలి



నెట్‌వర్క్ ఆస్పత్రులకు బిల్లులు చెల్లించి ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగించాలి. 90 శాతం మేర పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆరోగ్యశ్రీపై ఆధారపడ్డారు. ప్రస్తుతం సేవలు అందక అప్పులు చేసి వైద్యం చేయించుకోవాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం వెంటనే సేవలను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలి. అలాగే ప్రభుత్వాస్పత్రుల్లో పూర్తిస్థాయిలో వైద్యులను నియమించి మల్టీ స్పెషాలిటీ సేవలు అందేలా చూడాలి.
–బొర్రా గోపిమూర్తి, ఎమ్మెల్సీ

భరోసా లేదు



ఆరోగ్యశ్రీ పథకం పేద, మధ్యతరగతి వర్గాలకు భరోసాగా ఉంది. కూటమి ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ సేవలు తరచూ నిలిచిపోతున్నారు. దీంతో వేలు ఖర్చు పెట్టి ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోవాల్సి వస్తుంది. గత జగన్ ప్రభుత్వంలో ఏనాడూ ఆరోగ్యశ్రీ సేవలు బంద్ కాలేదు. ప్రస్తుతం పరిస్థితి భిన్నంగా ఉంది. మహిళల్లో క్యాన్సర్, ఇతర సమస్యలకు రూ.లక్షలు వెచ్చించాల్సి వస్తోంది.
–వీరవల్లి పద్మావతి, వీరవాసరం

పేదవాడు బతకలేడు



ఆరోగ్యశ్రీ లేకపోతే పేదవాడు బతకలేడు. ఎందుకంటే వైద్యం ఖరీదుగా మారిపోయింది. ఆరోగ్యశ్రీ ఉంటే ఉచిత సేవలు అందుతాయి. లేకుంటే చాలామంది వైద్యం చేయించుకునే పరిస్థితిలో లేరు. ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేస్తే గతంలో మాదిరిగా రోగం వస్తే ప్రాణాలు వదిలేసుకోవాల్సిందే. ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగించి ఉచితంగా వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలి. ఆరోగ్య ఆసరా కూడా అమలు చేయాలి.
– పాలా వెంకటనర్సయ్య, కవిటం

వైకల్యం ఓడింది

స్విమ్మింగ్‌లో సత్తాచాటిన దివ్యాంగులు



ఈత పోటీల్లో దివ్యాంగురాలు

ఏలూరు రూరల్: దివ్యాంగుల చేతుల్లో వైకల్యం ఓడింది. వైకల్యం శరీరానికే కాని.. తమ సామర్థ్యానికి కాదని మరోసారి నిరూపించారు. ఆదివారం ఏలూరు భీశ్వనాథ్ భర్తియా స్విమ్మింగ్‌పూల్ ఆవరణలో రాష్ట్రస్థాయి 7వ పారా స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. కాళ్లు, చేతులు లేకపోయినా ఈత కొలనులో ఈదుతూ అబ్బురపరిచ్చారు. సుమారు 100 మందికి పైగా క్రీడాకారులు 20, 40, 60 మీటర్ల స్విమ్మింగ్ పోటీల్లో తలపడ్డారు. ఆంధ్రప్రదేశ్ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో దివ్యాంగులు అంతర్జాతీయ స్థాయిలో 40కు పైగా పతకాలు సాధించారని కొనియాడారు. దివ్యాంగులకు ఆటలపై ఆసక్తిని పెంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుకునేలా కృషి చేస్తున్నామన్నారు. అనంతరం విజేతలకు పతకాలు అందించారు. ఎమ్మెల్యే బడేటి చంటి, డీఎస్‌డీఓ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



విజయ సంకేతం చూపుతూ..

ప్రాణం తీసిన మద్యం మత్తు

బైక్‌ను ఢీకొట్టిన లారీ.. వ్యక్తి దుర్మరణం

భీమడోలు: మద్యం మత్తులో ఉన్న లారీ డ్రైవర్ అతివేగంగా వాహనాన్ని నడుపుతూ బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ఆగడాలలంకకు చెందిన సిరింగి మోహనరావు (35) దుర్మరణం పాలయ్యారు. ఆదివారం సాయంత్రం గుండుగొలను పంచాయతీ పరిధిలోని వడ్డిగూడెం వద్ద దుర్ఘటన చోటుచేసుకుంది. లారీ ఢీకొన్న తర్వాత అర కిలోమీటరు మేర బైక్‌ను, మోహనరావును ఈడ్చుకెళ్లింది. వివరాలిలా ఉన్నాయి.. మోహనరావు గుండుగొలనులో చదువుకుంటున్న తన కుమారుడిని తీసుకుని వచ్చేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. మార్గమధ్యంలో ఘటనా స్థలి వద్ద వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలతో మోహనరావు అక్కడికక్కడే కన్నుమూశారు. గ్రామస్తులు భారీ సంఖ్యలో చేరుకుని లారీ డ్రైవర్‌ను పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం మృతుని కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. నిడమర్రు సీఐ రజనీకుమార్, ద్వారకాతిరుమల ఎస్సై సుధీర్ ఇక్కడకు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. లారీ డ్రైవర్‌ను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, గుండుగొలను సమీపంలోని ఓ ఫ్యాక్టరీకి చెందిన లారీ యాజమాని వచ్చి హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుమారు 3 గంటల పాటు ఆందోళన కొనసాగింది. మృతుని కుటుంబానికి న్యాయం చేస్తామని పోలీసులతో పాటు ఎంపీపీ కనమాల రామయ్య, మాజీ ఎంపీపీ శిరిబత్తిన కొండబాబు, గ్రామపెద్దలు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు చెప్పారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నా రు. వీరితో పాటి తల్లి, నానమ్మలను రోజువారీ పనులు చేస్తూ పోషిస్తున్నాడు. ఇంటికి ఆధారమైన మోహనరావు మృతితో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.



మోహనరావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ రజనీకుమార్

అవిగవిగో పాపికొండలు

- 3 నెలల అనంతరం విహారయాత్ర ప్రారంభం
- వరదల కారణంగా నిలిచిన బోటు ప్రయాణాలు
- వరద తగ్గుముఖంతో యాత్రకు అనుమతి

బుట్టాయగూడెం: పాపికొండల విహారం తిరిగి ప్రారంభమైయింది. గోదావరి వరదల కారణంగా సుమారు మూడు నెలల పాటు పాపికొండల యాత్రను ప్రభుత్వం నిలిపివేసింది. అయితే ప్రస్తుతం గోదావరిలో వరద తగ్గుముఖం పట్టడంతో విహారయాత్ర తిరిగి ప్రారంభించేందుకు పర్యాటక శాఖ అనుమతి ఇచ్చింది. దీంతో శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలం గండిపోచమ్మ తల్లి గుడి బోటు పాయింట్ నుంచి 23 మంది ప్రయాణికులతో బోటు ప్రయాణం ప్రారంభమైంది. అలాగే ఆదివారం ఉదయం 9 గంటలకు సుమారు 65 మంది ప్రయాణికులతో బోటు ప్రయాణం చేసినట్టు అధికారులు తెలిపారు. పాపికొండల పర్యాటక బోట్లు యథాతథంగా నడపడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు.

15 బోట్లు సిద్ధం
గోదావరి నది ఒడ్డున ఉన్న పాపికొండలు ప్రకృతి సౌందర్యానికి ప్రతీకగా పేర్గాంచాయి. గోదావరి ప్రవాహంలో ప్రకృతి రమణీయమైన ఎత్తయిన కొండల మధ్య సాగే బోటు ప్రయాణం పర్యాటకులు అపూర్వ అనుభూతిని అందిస్తుంది. అయితే గోదావరి వరదలు పెరగడంతో జూలై నెలలో విహార యాత్రను టూరిజం శాఖ అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. వరదల ప్రభావం తగ్గి నీటిమట్టం సాధారణ స్థాయికి చేరడంతో మరలా ప్రారంభించారు. పర్యాటకుల భద్రత కోసం అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. బోట్లలో పూర్తిగా సాంకేతిక తనిఖీలు చేసిన తర్వాతే ప్రయాణానికి అనుమతి ఇస్తున్నట్టు చెప్పారు. రెండు రోజుల నుంచి రెండు బోట్లు మాత్రమే సర్వీసులు అందిస్తున్నాయి. ఇదిలా ఉండగా పూర్తిస్థాయిలో సర్వీసులు నడిపేందుకు 15 బోట్లు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు చెప్పారు. విహారయాత్ర పునః ప్రారంభం కావడంతో పర్యాటకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పాపికొండల మధ్య బోటు ప్రయాణం

మరువలేని అనుభూతి



బోటుపై పాపికొండల విహారయాత్ర మరువలేని అనుభూతి. చెప్పలేని ఆనందాన్ని పొందుతాం. మూడు నెలల పాటు నిలిచిన యాత్ర పునః ప్రారంభం కావడం ఆనందదాయకం. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా బోటు ప్రయాణంతో మర్చిపోలేని తీపి జ్ఞాపకాలు పొందుతారు.
–చెరుకూరి రాజియోగి, పర్యాటకుడు, కేఆర్ పురం

దెందులూరులో రెచ్చిపోతున్న గ్రావెల్ మాఫియా

సాక్షి (టాస్క్‌ఫోర్స్): పోలవరం కుడికాలువ గట్టు గ్రావెల్‌ను కూటమి నేతలు ఇష్టారాజ్యంగా తవ్వి తరలిస్తున్న నేపథ్యంలో కూటమి నేతలకు చెందిన ఓ లారీ విద్యుదాఘాతానికి గురై మంటల్లో కాలిపోయిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ ప్రమాదంలో టిప్పర్ దగ్ధం కాగా డ్రైవర్ తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నాడు. వివరాలిలా ఉన్నాయి.. దెందులూరు నియోజకవర్గం పెదవేగి మండలంలోని కొప్పులవారిగూడెం సమీపంలోని పో లవరం కుడికాలువ వద్ద కూటమి నేతలు ఈనెల 10న గ్రావెల్‌ను తవ్వి టిప్పర్ లారీలో తరలిస్తుండగా లారీ హైడ్రాలిక్ హైటెన్షన్ విద్యుత్ తీగలకు తగలడంతో ఒక్కసారిగా మంటలు ఎగబాకాయి. నిమిషాల వ్యవధిలో భారీగా మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. విషయాన్ని కూటమి నేతలు గోప్యంగా ఉంచడంతో పాటు ఫిర్యాదు నమోదు కాకుండా చూసుకున్నారు. ఇదిలా ఉండగా ప్రమాదంలో ఏలూరు తాపీమేస్త్రి కాలనీకి చెందిన రాజేష్ అనే లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు ఏలూరు ఆయుష్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి అత్యవసర వైద్యం నిమిత్తం విజయవాడ తరలించారు. దీనిపై కేసు నమోదు కాకుండా కూటమి నేతలు పావులు కదుపుతున్నారు.



విద్యుదాఘాతానికి మంటల్లో దగ్ధమవుతున్న టిప్పర్ లారీ

పారిశుద్ధ్య కార్మికుల పోరుబాట

- వర్క్ అవుట్ సోర్సింగ్‌పై తీవ్ర వ్యతిరేకత
- ఏలూరు కార్పొరేషన్‌లో అమలుకు ప్రభుత్వం ప్రయత్నం
- భగ్గుమంటున్న కార్మిక సంఘాలు
- మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ మాట తప్పారంటూ నిరసన
- రేపు భారీ ధర్నాకు సన్నాహాలు

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో వర్క్ అవుట్ సోర్సింగ్ పేరిట ప్రైవేటీకరణ విధానాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం ప్రయత్నించడాన్ని కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఇప్పటికే పారిశుద్ధ్య పనులను ప్రైవేటీకరించ వద్దు, ప్రయోగాత్మకంగా రెండు డివిజన్లలో అమలు చేయాలనే ఆలోచనను విరమించుకోవాలని కోరుతూ కమిషనర్ ఎ.భానుప్రతాప్‌కు వినతిపత్రం సైతం అందించారు. సాక్షాత్తూ మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ సొంత నియోజకవర్గం నెల్లూరులో ఈ విధానాన్ని అమలు చేయబోతే కార్మిక సంఘాల వ్యతిరేకతతో వెనక్కి తగ్గారని నాయకులు గుర్తుచేస్తున్నారు. కార్మికులను బానిసలుగా మార్చే వర్క్ అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి, ఆప్కాస్ ద్వారా మున్సిపల్ కార్మికుల నియామకాలను జరపాలని డిమాండ్ చేస్తున్నారు.



ఏలూరు కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

మాట తప్పిన మంత్రి
నెల్లూరులో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైన సందర్భంగా వర్క్ అవుట్ సోర్సింగ్ విధానాన్ని రాష్ట్రంలో మరెక్కడా అమలు చేయబోమని మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారని కార్మిక సంఘ నాయకులు చెబుతున్నారు. అయితే ఇందుకు భిన్నంగా ఏలూరు కార్పొరేషన్ వన్‌టౌన్‌లో 11వ డివిజన్, టూటౌన్‌లో 30 డివిజన్‌లో ఈ విధానాన్ని అమలు చేయడానికి పావులు కదుపుతున్నారని మండిపడుతున్నారు. ఏలూరు నగరంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మున్సిపల్ కార్మికుల నియామకాలను ఆప్కాస్ ద్వారా చేపట్టాలని, నగర ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించేందుకు కృషి చేయాలని కోరుతున్నారు.

ప్రైవేటీకరణతో అస్తవ్యస్తం
పారిశుద్ధ్య పనులను ప్రైవేటీకరించడం అంటే ప్రజల ప్రాణాలను బలిపెట్టడమేనని, పారిశుద్ధ్య వ్యవస్థ అస్తవ్యస్తమవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని, లేకుంటే నెల్లూరు తరహాలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ప్రైవేటీకరణ వల్ల దళారీ వ్యవస్థ ఏర్పడుతుందని, కనీస వేతనాలు, కార్మిక చట్టాల అమలుకావని ఆందోళన వ్యక్తం చేశారు.

రేపు ఏలూరులో ధర్నా
వర్క్ అవుట్ సోర్సింగ్ విధానం అమలును నిరసిస్తూ మంగళవారం ఉదయం 10 గంటలకు ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించాలని ఏపీ మున్సిపల్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నగర కమిటీ సమావేశం తీర్మానించింది. ఈ ధర్నాలో అన్ని సర్కిళ్లకు చెందిన మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చింది. అలాగే నగరంలోని కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు, ప్రజా సంఘాలు మద్దతు తెలపాలని యూనియన్ నాయకులు కోరారు.

మంత్రి మాట తప్పారు



సాక్షాత్తు మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ నెల్లూరు మున్సిపాల్టీలో పారిశుద్ధ్య పనులను ప్రైవేటీకరించేందుకు ప్రయత్నించే సమయంలో సీఐటీయూ తీవ్రంగా వ్యతిరేకించింది. ఆ సమయంలో రాష్ట్రంలో మరెక్కడా దీనిని అమలు చేయబోమని మంత్రి హామీ ఇచ్చారు. అయితే ఈ హామీని తుంగలోకి తొక్కి ఏలూరు కార్పొరేషన్‌లో ప్రైవేటీకరించాలనుకోవడం తగదు.
–డీఎన్‌వీడీ ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి, సీఐటీయూ, ఏలూరు

ప్రైవేటీకరణ తగదు



వర్క్ అవుట్ సోర్సింగ్ విధానంలో నగరంలోని 11,30 డివిజన్లలోని పారిశుద్ధ్య పనులను ప్రైవేటీకరించాలనుకునే విధానాన్ని తక్షణం నిలుపుదల చేయాలి. కార్పొరేషన్‌లోని ఖాళీలను ఆప్కాస్ విధానంలో భర్తీ చేయాలి. అవు ట్ సోర్సింగ్ విధానం రద్దు చేయాలి. కొన్నేళ్లు గా ఖాళీగా ఉన్న మున్సిపల్ కార్మికుల పోస్టుల ను తక్షణం భర్తీ చేయాలి. ఈనెల 14న జరిగే ధర్నాను కార్మికులు విజయవంతం చేయాలి.
–బి.సోమయ్య,ఏపీ మున్సిపల్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఏలూరు

అప్రదక్షిణ మార్గంలో క్యూలైన్ నిర్మాణమా?

దేవదాయ శాఖ కమిషనర్‌కు ఆధ్యాత్మిక వేత్త ఫిర్యాదు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయంలో అప్రదక్షిణ మార్గంలో దర్శనం క్యూలైన్ల నిర్మాణాలు చేపట్టడం ఆగమశాస్త్ర విరుద్ధమంటూ ఓ ఆధ్యాత్మిక వేత్త ఇటీవల రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశాడు. దీనిపై దేవస్థానం అధికారులను కమిషనర్ రిమార్క్స్ అడగడంతో ఆ నిర్మాణ పనులకు తాజాగా బ్రేక్ పడింది. ద్వారకాతిరుమల దివ్య క్షేత్రాన్ని సందర్శించే భక్తుల సౌకర్యార్థం రూ.12.50 కోట్లతో చేపట్టిన నూతన క్యూ కాంప్లెక్స్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఇదిలా ఉంటే క్యూ కాంప్లెక్స్‌లోని భక్తులు ముందుగా దక్షిణ రాజగోపురం లోంచి ఆలయంలోకి చేరుకుని, అక్కడి నుంచి తూర్పువైపుకు తిరిగి క్యూలైన్ల గుండా శ్రీవారి దర్శనానికి వెళ్లేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు. అందులో భాగంగానే తూర్పు వైపున ఉన్న పాత క్యూలైన్లలో కొన్నింటిని తొలగించి, అక్కడ ఎత్తయిన కాంక్రీటు చప్టాను నిర్మించారు. దానిపై కొత్త క్యూలైన్లు నిర్మించాల్సి ఉంది. ఏలూరుకు చెందిన ఆధ్యాత్మిక వేత్త, హైకోర్టు న్యాయవాది బీకేఎస్ఆర్ అయ్యంగార్ ఈ క్యూలైన్ నిర్మాణ పనులు అప్రదక్షిణంగా జరుగుతున్నాయంటూ దేవదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

అప్రదక్షిణం ఎలా అంటే..

భక్తులు దక్షిణ రాజగోపురం లోంచి ఆలయంలోకి ప్రవేశించగానే, పడమర వైపు (ఎడమ వైపు)కు తిరిగి శ్రీవారి దర్శనానికి వెళ్లాలని, అలా కాకుండా తూర్పు వైపు (కుడి వైపు)కు తిరిగి వెళ్లడం అప్రదక్షిణమని, ఇది పూర్తిగా ఆగమశాస్త్ర విరుద్ధమని అయ్యంగార్ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన కమిషనర్ దేవస్థానం అధికారులను రిమార్క్స్ అడగడంతో కాంక్రీటు చప్టాపై క్యూలైన్ నిర్మాణ పనులకు బ్రేక్ పడింది.


తూర్పు వైపు నిర్మించిన వివాదాస్పద కాంక్రీటు చప్టాపై కూర్చున్న భక్తులు


అర్చకుల మరుగుదొడ్లు తొలగించిన ప్రాంతం

అర్చకులకు తప్పని ఇక్కట్లు

గతంలో ఆలయ పడమర వైపు అర్చకులకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు ఉండేవి. అభివృద్ధి పనుల్లో భాగంగా ఏడాదిన్నర క్రితం వాటిని తొలగించారు. ఇప్పటి వరకు తిరిగి నిర్మించలేదు. దాంతో ఆలయంలో విధులు నిర్వర్తిస్తున్న సమయంలో అర్చకులు కాలకృత్యాలు తీర్చుకోవాల్సి వస్తే.. తమ ఇళ్లకు పరుగులు తీయాల్సి వస్తోంది. నిత్యం దేవుడి సేవలో ఉండే అర్చకుల పరిస్థితే ఇలా ఉంటే ఎలా అని పలువురు ముక్కున వేలేసుకుంటున్నారు.

దగ్గరగా నిర్మిస్తేనే సౌకర్యం..

ఆలయానికి దగ్గరగా, అందుబాటులో నిర్మించిన కట్టడాలనే భక్తుల ఎక్కువగా వినియోగిస్తున్నారు. దూరంగా ఉన్న వాటికి ప్రాధాన్యత అంతంత మాత్రమనే చెప్పాలి. ప్రస్తుతం ఆలయ తూర్పు ప్రాంతంలో రూ. 12 కోట్లతో విస్తరిస్తున్న అనివేటి మండపం, రూ.12.50 కోట్లతో నిర్మిస్తున్న క్యూ కాంప్లెక్స్ దేవాలయానికి దగ్గరగా ఉన్నాయి. ఇవి సౌకర్యవంతంగా ఉంటాయి. ఆరేళ్ల క్రితం ఆలయానికి దూరంగా రూ.2.50 కోట్లతో ఆధునీకరించిన మాధవుని కుంట నిరుపయోగంగా మారింది. అలాగే రూ.8.50 కోట్లతో నిర్మించిన కల్యాణకట్ట భక్తులకు అసౌకర్యంగా ఉండటంతో, కొండపైన సెంట్రల్ పార్కింగ్ ప్రాంతంలో షెడ్లు నిర్మించి కల్యాణ కట్టను అందులోకి మార్చే యోచనలో అధికారులు ఉన్నట్టు తెలుస్తోంది. రూ. 4.10 కోట్లతో నిర్మించిన క్యాంటీన్ ఆలయానికి దూరంగా, మూలన ఉండటంతో భక్తులు అందులోకి వెళ్లేవారు కాదు. ఫలితంగా క్యాంటీన్ నిర్వహించలేమని ప్రైవేట్ వ్యాపారులు, ఒకానొక దశలో దేవస్థానం అధికారులు చేతులెత్తేశారు. దాంతో కొన్నాళ్లగా కొండపైన క్యాంటిన్ లేక భక్తులు అవస్థలు పడుతున్నారు. ఇప్పుడు తూర్పువైపు సప్తగోకుల ప్రాంతంలో తాత్కాలికంగా క్యాంటీన్ ఏర్పాటు చేసుకుని, మూడేళ్లపాటు నిర్వహించుకునే హక్కుకు దేవస్థానం ఈనెల 17న టెండర్, బహిరంగ వేలాన్ని నిర్వహించనుంది.

న్యాయ పోరాటం చేస్తా



శ్రీవారి ఆలయంలో ఆగమ విరుద్ధంగా అప్రదక్షిణ మార్గంలో క్యూలైన్లు నిర్మిస్తుండటంపై ఇటీవల రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశాను. మాధవుని కుంటకు పెట్టిన రూ.2.50 కోట్ల ఖర్చు, నృసింహ సాగర అభివృద్ధికి పెట్టి ఉంటే బాగుండేది. ఇప్పటికైనా పుష్కరిణిని అభివృద్ధి చేసి, పూర్వ ఆచార సాంప్రదాయాలను కొనసాగించాలి. లేకుంటే న్యాయపోరాటం చేస్తాను.

– బీకేఎస్ఆర్ అయ్యంగార్, ఆధ్యాత్మిక వేత్త, హైకోర్టు న్యాయమూర్తి

రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఏలూరు టౌన్: ఏలూరు శివారు వట్లూరు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు ప్రమాదంలో మృతి చెందాడు. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. ఏలూరు శివారు వట్లూరు రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం మధ్యాహ్నం రైలు ప్రమాదంలో మృతిచెందాడు. రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించగా...అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడి ఎత్తు 5.5 అడుగులు, చామన చాయ రంగుతో, తెలుపు నలుపు చారల చొక్కా, బిస్కెట్ రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. అతని వయసు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉంటుందని అంచనా. మృతదేహాన్ని ఏలూరు జీజీహెచ్ మార్చురీలో భద్రపరిచామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు.

వివాహిత అనుమానాస్పద మృతి


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శివాజీ

దెందులూరు: సానిగూడెం గ్రామంలో భర్త, అత్తతో కలిసి అద్దె ఇంట్లో నివసిస్తున్న వివాహిత నేతల లీలామణి (19) అనుమానాస్పద స్థితిలో శనివారం రాత్రి మృతి చెందింది. స్థానికులు, కుటుంబ సభ్యుల సమాచారం మేరకు వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నట్లు పోలీసులు తెలిపారు. విచారణ నిర్వహించి కేసు నమోదు చేశామన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మృతి వెనుక గల కారణాలు పూర్తిగా తెలియాల్సి ఉందని, అన్ని కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

చెస్ పోటీలు ప్రారంభం


భీమవరంలో రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

భీమవరం: ఏపీ, తెలంగాణ రాష్ట్రాల స్థాయి ఓపెన్ ర్యాపిడ్ చెస్ టోర్నీ భీమవరంలో ఆదివారం ప్రారంభమైంది. మొత్తం 195 మంది క్రీడాకారులు హాజరయ్యారని, విజేతలకు రూ.లక్ష నగదు బహుమతులతో పాటు చాంపియన్ ట్రోఫీ, జ్ఞాపికను అందజేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చదరంగం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణరావు, కార్యదర్శి సుమన్, కేజీఆర్ఎల్ కళాశాల కోశాధికారి గన్నాబత్తుల శ్రీనివాస్, ఒలింపిక్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఆరేటి ప్రకాష్, గ్రంధి రవితేజ తదితరులు పాల్గొన్నారు.

భర్తపై వేధింపుల కేసు

జంగారెడ్డిగూడెం: భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్తపై కేసు నమోదు చేశామని పోలీస్ స్టేషన్ రైటర్ పి.బాబూరావు తెలిపారు. తన భర్త శ్రీను నిత్యం మద్యం సేవించి వచ్చి తనను కొట్టి వేధిస్తున్నాడని, వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని స్థానిక రాజీవ్ నగర్‌కు చెందిన దేరంగుల వెంకటేశ్వరమ్మ ఫిర్యాదు చేసిందన్నారు. ఈ నెల 10న రాత్రి మద్యం సేవించి వచ్చి తీవ్రంగా కొట్టడంతో వెంకటేశ్వరమ్మ స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతుందని, ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని బాబూరావు తెలిపారు.

చల్లంగా చూడమ్మా.. మంగమ్మ తల్లి


గుబ్బల మంగమ్మ గుడి వద్ద పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండలం కామవరం సమీపంలో దట్టమైన అటవీప్రాంతంలో కొలువై భక్తుల పూజలందుకుంటున్న గుబ్బల మంగమ్మతల్లి గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక బస్సులు, లారీలు, కార్లు, జీపులు, ద్విచక్రవాహనాల్లో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆంధ్ర, తెలంగాణ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో మంగమ్మ తల్లి గుడికి తరలివచ్చారు. వచ్చిన భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం – చేవూరిపాలెం సెంటరులో సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. భక్తులు ఉదయమే ఆలయానికి చేరుకుని స్వామివారి పుట్టలో పాలు పోసి దర్శించుకున్నారు.

మందుబాబులకు అడ్డాగా.. శ్రీవారి పుష్కరిణి

- మెట్లపైనే మద్యం, బీరు సీసాలు, సిగరెట్లు
- అధ్వానంగా ఉన్న పుష్కరణిలోని నీరు

ద్వారకాతిరుమల: ప్రతి ఏటా కార్తీకమాసంలో వచ్చే క్షీరాబ్ధి ద్వాదశి నాడు శ్రీవారి తెప్పోత్సవాన్ని నిర్వహించే నృసింహ సాగరం (పుష్కరిణి) అధ్వానంగా మారింది. రాత్రి అయితే చాలు మందు బాబులు సాగరం మెట్లపైకి చేరి మద్యం, బీరులు, ఖాళీ సీసాలను అక్కడే పడేస్తున్నారు. కాల్చి పడేసిన సిగరెట్టు పీకలు, ఖాళీ పెట్టెలు మెట్లపక్కన దర్శనమిస్తున్నాయి. ఏకంగా బీరు సీసాలను సాగరం వద్ద ఉన్న గణేషుడి విగ్రహం పక్కనే పెడుతున్నారు. పుష్కరిణి సైతం చెత్తా, చెదారం, మురుగుతో దారుణంగా ఉంది. పురాణ ప్రాశస్త్యం గల ఈ సాగరాన్ని సందర్శించేందుకు నిత్యం సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులు వీటిని చూసి విస్తుపోతున్నారు. పవిత్రమైన ప్రదేశం ఇంత దారుణంగా ఉంటే ఆలయ అధికారులు ఏం చేస్తున్నారని పలువురు మండిపడుతున్నారు. పూర్వం ఈ సాగరం వద్దే భక్తులు మొక్కులు తీర్చుకుని, స్నానాలు ఆచరించి, ఆలయానికి వెళ్లేవారు. స్వామివారికి నిత్యం తీర్థపు బిందె ఇక్కడి నుంచే వెళ్లేది. ఇప్పుడు ఆ ఆచారం కొనసాగడం లేదు. తెప్పోత్సవాన్ని మాత్రం ఏటా దేవస్థానం వైభవంగా నిర్వహిస్తోంది. ఆ ఉత్సవ సమయంలో మాత్రమే సాగరాన్ని, పరిసరాలను అధికారులు ముస్తాబు చేస్తున్నారు. ఆ తరువాత మళ్లీ పట్టించుకోవడం లేదు. దాంతో పుష్కరిణి ప్రాంతం మందుబాబులకు అడ్డాగా మారింది. ఇప్పటికైనా ఆలయ అధికారులు స్పందించి పుష్కరిణి అభివృద్ధికి కృషి చేయాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు. అలాగే సెక్యూరిటీని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, పుష్కరణి పవిత్రతను, భక్తుల మనోభావాలను కాపాడాలని అంటున్నారు.


శ్రీవారి పుష్కరణి వద్ద వినాయకుడి విగ్రహం పక్కనే ఉన్న బీరు సీసాలు


సాగరం మెట్లు పక్కన సిగరెట్టు పీకలు, ఖాళీ పెట్టెలు


అధ్వానంగా ఉన్న నృసింహసాగరం

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు


తణుకులో అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్, రెవెన్యూ అధికారులు

తణుకు అర్బన్: గంజాయి తరలిస్తున్న యువకులను ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేసిన ఘటన తణుకు శివారులో జరిగింది. తణుకు పట్టణ పరిధిలోని ఉండ్రాజవరం జంక్షన్ నుంచి ఉండ్రాజవరం మండలం పాలంగి ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై గంజాయి తరలిస్తున్న యువకులను అరెస్టు చేసి 5 కిలోల గంజాయిని తణుకు ఎక్సైజ్ సీఐ సత్తి మణికంఠరెడ్డి, ఎస్సైలు, సిబ్బంది పట్టుకున్నారు. ఆదివారం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సోదాల్లో అనుమానాస్పదంగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని విచారించగా గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. సోదాల సమయంలో ప్రధాన నిందితుడు పోలవరపు కుమార్ శివ పారిపోగా, మీసాల ఈశ్వరరావు, చీలి వినయ్‌ను అదుపులోకి తీసుకుని వారి నుంచి 5 కిలోల గంజాయితోపాటు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీరు గంజాయిని చిన్న ప్యాకెట్లలో తణుకు పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని సీఐ తెలిపారు. సోదాల్లో ఎక్సైజ్ ఎస్సై ఆర్.మధుబాబు, తణుకు డిప్యూటీ తహసీల్దార్ నీలి శ్రీదేవి, వీఆర్వో బసవా వెంకటరత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

బావిలో దూకి మహిళ ఆత్మహత్య

జంగారెడ్డిగూడెం: కుమారుడు మృతి చెందాడనే మనస్తాపంతో కొండేపూడి నాగమణి (40) ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం జరిగింది. ఎస్సై ఎస్‌కే జబీర్ వివరాల ప్రకారం.. పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న కొండేపూడి నాగమణి స్థానిక ముత్యాలమ్మ నగర్‌లో ఉంటుంది. ఆమె భర్త మద్యానికి బానిసయ్యాడు. గత ఏడాది కుమారుడు మృతి చెందాడు. అప్పటినుంచి ఆమెకు మతి స్థిమితం లేదు. పది నెలల క్రితం కుమార్తెకు వివాహం చేశారు. తన కుమారుడు చనిపోయాడని, తాను కూడా ఏదో ఒకరోజు చనిపోతానని మృతురాలు కుమార్తెతో చెబుతూ ఉండేది. నాగమణి ఆదివారం గరుడ పక్షి నగర్ వద్ద పంట పొలాల్లో ఉన్న బావిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఆలస్యంగా గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని వెలికితీయించి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రాట్నాలమ్మ

పెదవేగి: రాట్నాలమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు. పెదవేగి మండలం రాట్నాల కుంటలో వేంచేసిన రాట్నాలమ్మకు ఆదివారం ప్రీతికరమైన రోజు కావడంతో ఉభయగోదావరి జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో దేవస్థానానికి చేరుకుని, మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు చిన్నారులకు అన్నప్రాసనలు, అక్షరాభ్యాసనలు, మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ వారం మొత్తం 1,42,855 ఆదాయం లభించిందని ఈవో ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు.

'అస్తమయానికి ముందు.. తరువాత' పుస్తకావిష్కరణ

భీమవరం(ప్రకాశంచౌక్): రచయిత సాహితీవేత్త దేవరకొండ బాల సుబ్రహ్మణ్యం రచించిన అష్టాదశ కథ సంపుటి అస్తమయానికి ముందు.. తరువాత పుస్తకాన్ని తిరుపతి వెంకటేశ్వర వేదిక్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ రాణి సదాశివరావు మూర్తి ఆవిష్కరించారు. భీమవరం హౌసింగ్ బోర్డ్ కాలనీలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం పుస్తకావిష్కరణ నిర్వహించారు. రిటైర్డ్ డీఐజీ పీవీఎస్ రామకృష్ణ మాట్లాడుతూ సాహిత్య విలువలు కాపాడుకుంటే మన సంస్కృతిని కాపాడుకున్నట్లేనని, సాహిత్య రంగానికి మన దేశంలో ఎంతో గుర్తింపు ఉందన్నారు. కార్యక్రమంలో మందిర అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి, బాల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


రచయిత దేవరకొండ బాల సుబ్రహ్మణ్యంను సత్కరిస్తున్న దృశ్యం

కాల్వలో పడి బాలుడి గల్లంతు


కాలువ వద్ద బాలుడి ప్యాంట్, చెప్పులు పరిశీలిస్తున్న ఎస్సై చంద్రశేఖర్

తణుకు అర్బన్: బాలుడు కాలువలో పడి గల్లంతైన ఘటన పైడిపర్రులో ఆదివారం చోటుచేసుకుంది. తణుకు బ్యాంక్ కాలనీలో నివసిస్తున్న బొమ్మనబోయిన జోగీంద్ర నందు(13) ఆదివారం తన స్నేహితులతో కలిసి ఆడుకునేందుకు తణుకులోని పైడిపర్రు ప్రాంతానికి వచ్చాడు. మధ్యాహ్నం సమయంలో కాలువ రేవులోకి దిగి స్నానం చేసేందుకు ప్రయత్నించగా ప్రమాదవశాత్తూ గల్లంతయ్యాడు. స్థానికులు గమనించి కాల్వలో గాలించినప్పటికీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో తణుకు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ ఎస్సై కె.చంద్రశేఖర్ ఘటనా స్థలానికి చేరుకుని పోలీసు, ఫైర్ సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న బాలుడి తల్లితండ్రులు ప్రమాదప్రాంతానికి వచ్చి కన్నీటి పర్యంతమయ్యారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


జోగీంద్ర నందు(ఫైల్)

మహిళపై దాడి

ముదినేపల్లి రూరల్: మహిళపై ఇద్దరు వ్యక్తులు దాడి చేసిన ఘటన మండలంలోని బొమ్మినంపాడులో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన కనిగెళ్ళ సింధు కూలీ పనులతో పాటు మేకలను మేపుకుంటూ జీవిస్తోంది. శనివారం మేకలు తోలుకుని పొలం గట్టుకు వెళ్ళగా పరిచయమున్న వ్యక్తితో మాట్లాడింది. అయితే విజయబాబు, టీ.కార్తీక్‌లు ఆమెను దుర్భాషలాడారు. ఈ విషయం ఫోన్ ద్వారా భర్తకు సింధు తెలిపింది. భర్త వచ్చి విజయబాబు, కార్తీక భూషణంను నిలదీయగా తనతో పాటు భర్తపై వారిద్దరూ దాడి చేసినట్లు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఎల్. అగ్రహారం సమీపంలో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు రూరల్ పోలీసులు ఆదివారం తెలిపారు. మృతుడు టీ షర్టు, షార్ట్ ధరించి ఉన్నాడని, వివరాలు తెలిసిన వారు 9440796612, 9441834286 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

జీడిమామిడి పూత దశలో జాగ్రత్తలు


మెట్ట ప్రాంతంలో పూత దశలో ఉన్న జీడి మామిడి తోట


జీడి తోటలో చెట్లకు దోమ సోకిన దశ్యం

చింతలపూడి: మెట్ట ప్రాంతంలో జీడి తోటలు ఎక్కువగా విస్తరించాయి. ప్రస్తుతం జీడి పూత ప్రారంభ దశలో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో జీడి మామిడి రైతులు పూత దశ నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉద్యాన శాఖ అధికారిణి ఎండి షాఫియా ఫర్హీన్ రైతులకు సూచిస్తున్నారు. సాధారణంగా జీడిమిమిడిలో పూత అక్టోబర్, నవంబర్ నెలల్లో ప్రారంభమై జనవరి, ఫిబ్రవరి వరకు వస్తుంది. జీడిచెట్టుకు వచ్చిన పూతలో సుమారు 200 నుండి 800 వరకు పూలు పూస్తాయి. జీడిమామిడి చెట్లు పరాగ సంపర్కం వల్ల ఫలదీకరణ చెందుతాయి. జీడి మామిడి చెట్లు పూతకు రావాలంటే సుమారు 25 రోజుల నుంచి 30 రోజులు పొడి వాతావరణం ఉండాలి. ఒకవేళ అక్టోబర్ నుంచి నవంబర్ నెల వరకు వర్షాలు పడితే పూత ఆలస్యమై రాలిపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. తెగుళ్ల తీవ్రత కూడా ఎక్కువయ్యే అవకాశాలు ఎక్కువ.

జీడిమామిడి అంట్లు నాటిన రెండో సంవత్సరం నుంచే పూత వస్తుంది. ఆ పూతను రైతులు తుంచేసి చెట్ల శాఖలు పెరగడానికి ప్రోత్సహించాలి. దీనివల్ల చెట్లు బలంగా పెరిగి ఎక్కువ దిగుబడిని ఇస్తాయి. వర్షాకాలంలో సిఫార్సు చేసిన ఎరువులు రెండు నుంచి మూడు సమ భాగాలుగా వేసుకోవాలి. ఐదు సంవత్సరాలు పైబడిన చెట్టుకు యూరియ 1.5 కేజీలు, సూపర్ ఫాస్ఫేట్ 650 గ్రాములు, పొటాష్ కేజీ వేసుకోవాలి. పూత దశలో మంచు ఎక్కువగా పడుతున్నప్పుడు పూత లోపల తేమ చేరి ఎండిన మగపూల వల్ల తామర పురుగులు లేదా తేయాకు దోమ ఉధృతి ఎక్కువయ్యే అవకాశాలు ఉంటాయి.

టి.దోమ సోకితే..

జీడిమామిడిలో టి దోమ పూత దశ అంటే అక్టోబర్, నవంబర్ నెలలో మొదలవుతుంది. జనవరిలో ఎక్కువై లేత చిగుళ్ళు, పూత, పూత కాడలను, చిన్న కాయలను ఆశించి రసం పీల్చడం ప్రారంభిస్తాయి. రసం పీల్చినప్పుడు ఒక రకమైన పదార్థం వదలడం వల్ల కాయలపై, చిగుర్లపై గజ్జిలాంటి లక్షణాలు కనిపిస్తాయి. అంతే కాకుండా పూత, చిగుర్లపై రంధ్రాల వల్ల ఫ్లవర్ బ్లైట్ అనే తెగులు వ్యాప్తి చెందుతుంది. దోమ నివారణకు పూత మొదలై పువ్వు విచ్చుకోక ముందు ఒకసారి, పూలు ఫలదీకరణ చెందిన తరువాత రెండోసారి, కాయ గోలీ సైజులో ఉన్నప్పుడు మూడో సారి పిచికారీ చెయ్యాలి.

చెట్లు చిగురించినప్పుడు మొదటి పిచికారీకి రైతులు ల్యాండా సైహాలోత్రిన్ 0.6 మిల్లీలీటర్లు లీటరు నీటికి, లేదా అసిటామాప్రిడ్ 0.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పూత కొమ్మలు కనిపించినప్పుడు రెండు, మూడు వారాల తరువాత ఇమిడాక్లోప్రిడ్ 0.6 మి.లీ లీటరు నీటికి లేదా ప్రొఫెనోఫాస్ 1.5 మి.లీ లీటరు నీటికి కలిపి రెండోసారి పిచికారీ చేయాలి. కాయలు గోలీ సైజులో ఉన్నప్పుడు ల్యాండా సైహాలోత్రిన్ 0.6 మిల్లీలీటర్లు లీటరు నీటికి లేదా ప్రొఫెనోఫాస్ 1.5 మి.లీ లీటరు నీటికి కలిపి మూడోసారి పిచికారీ చేయాలి. వీటితో పాటు వేపనూనెను తగిన మోతాదులో కలిపి వాడటం వల్ల మంచి ఫలితాలు వస్తాయి.

పొడి వాతావరణం ఉన్నప్పుడు బూడిద తెగులు ఎక్కువగా పూతను నష్టపరిచి పూత రాలిపోయేలా చేస్తుంది. బూడిద తెగులు వల్ల లేత చిగుళ్లను, పూతను ఆశించి ఎండిపోయేలా చేసి పంటను నష్టపరుస్తుంది. దీని నివారణకు సల్ఫర్ 3 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా ట్రై డేమోర్ఫ్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ఆకు పూత, కాయ మచ్చ తెగులు నివారణకు

ఆకులపై చిన్న, చిన్న లేత ఆకుపచ్చ వర్ణంలో మచ్చలు ఏర్పడి క్రమేపీ మచ్చలు పెరుగుతూ మచ్చ మధ్య ఎండిపోయి చివరికి మొత్తం ఆకు ఎండి రాలిపోతుంది. పూత, పూత కాడలపై మచ్చలు వచ్చి పూత ఎండిపోయి రాలిపోతుంది. దీని నివారణకు రైతులు తొలుత తెగులు ఆశించిన కొమ్మలు తొలగించుకోవాలి. మాంకోజెట్ గ్రాము లీటరు నీటికి, లేదా కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములు లీటర్ నీటికి, లేదా క్లోరో తాలోనిల్ పిచికారీ చేసుకోవాలి.



ఎండి షాఫియ ఫర్హీన్
ఉద్యానశాఖ అధికారిణి - చింతలపూడి

క్లుప్తంగా

యాచకుడి మృతదేహానికి అంత్యక్రియలు



యాచక వృద్ధుడి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించిన ఫౌండేషన్ సభ్యులు

తణుకు అర్బన్: స్థానిక వెంకటేశ్వర సెంటర్‌లో భిక్షాటన చేస్తూ జీవిస్తున్న వృద్ధుడు మృతి చెందడంతో ఉండుర్తి పాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సభ్యులు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. సుమారు 60 సంవత్సరాల వయస్సున్న వృద్ధుడు భిక్షాటన చేస్తూ కొంతకాలంగా ఇదే ప్రాంతంలో జీవిస్తూ ఆదివారం మృతి చెందాడని స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులను సంప్రదించి అంత్యక్రియలు నిర్వహించామని ఫౌండేషన్ చైర్మన్ ఉండుర్తి ప్రసన్నకుమార్ తెలిపారు. స్థానికులు ఫౌండేషన్ సేవలను అభినందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు దున్న అమర్ బాబు, తలపాకు అఖిల్, అభిషేక్ బోస్, టినేటి బన్నీ, సత్తిపండు తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్తీ మద్యంపై ధర్నా

ఆకివీడు: రాష్ట్రంలో ఏరులై పారుతున్న కల్తీ మద్యాన్ని అరికట్టాలని రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం స్థానిక ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ కమిటీ అధ్యక్షులు అంబటి రమేష్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కల్తీ మద్యం తయారు చేయించి, వాటిని మార్కెట్‌లో విక్రయించి ప్రజల ఆరోగ్యంతో, ప్రాణాలతో కూటమి ప్రభుత్వం ఆడుకుంటుందని ఆవేదన వ్యక్తంచేశారు. కల్తీ మద్యం కుంభకోణంలో టీడీపీ నాయకుల పేర్లు బయటకు వచ్చినప్పటికీ ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తూ చర్యలు తీసుకోవడంలేదని మండిపడ్డారు. కల్తీ మద్యం అరికట్టేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే విధంగా సోమవారం ఉదయం 11 గంటలకు ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నాలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పీవీఎల్.నర్సింహరాజు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, మహిళలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని రమేష్ విజ్ఞప్తి చేశారు.

మోటార్‌సైకిల్ ఢీకొని వ్యక్తికి గాయాలు

భీమవరం: స్థానిక ప్రకాశం చౌక్ సెంటర్‌లో రోడ్డు ప్రమాదంలో గాయపడిన పొన్నపల్లి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై బీవై కిరణ్ కుమార్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గణపవరం మండలం కేశవరం గ్రామానికి చెందిన శ్రీనివాసరావు గత నెల 30న తన గ్రామం నుంచి సొంత పనిపై తన భార్యతో కలిసి మోటారు సైకిల్‌పై భీమవరం వచ్చి తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ప్రకాశం చౌక్ సెంటర్‌లో మరో మోటారు సైకిల్‌పై నిర్లక్ష్యంగా వస్తున్న వ్యక్తి శ్రీనివాసరావు మోటారు సైకిల్‌ను ఢీకొట్టాడు. ప్రమాదంలో శ్రీనివాసరావు కాలు విరిగడంతో పాటు పలు చోట్ల గాయాలయ్యాయి. దీంతో బాధితుడు శ్రీనివాసరావు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం పోలీసులను ఆశ్రయించాడు.

ఉచిత ధ్యాన శిక్షణ

వీరవాసరం: పట్టణంలో శ్రీ సీతారామస్వామి దేవస్థానం ప్రాంగణంలో వీరవాసరం మండల పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత ధ్యానశిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నానికి చెందిన సీనియర్ పిరమిడ్ గ్రాండ్ మాస్టర్ కేవీ రావు పాల్గొని జ్ఞానబోధ చేసి ధ్యానశిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కో–ఆర్డినేటర్ కేవీడీ ప్రసాద్ మాట్లాడుతూ నవంబరు 14,15,16 తేదీలలో వీరవాసరం మండల పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ 20వ వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజుల ధ్యాన యజ్ఞం ఇదే దేవస్థానం ప్రాంగణంలో ఉంటుందని స్పష్టం చేశారు. మద్దాల శ్రీరామకృష్ణ, మేడిశెట్టి కృష్ణారావు, ఎస్.ఉదయ్, కె.మోహన్, వి.విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

అధ్వానంగా డ్రెయినేజీ వ్యవస్థ

- గృహాల్లోకి మురుగునీరు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



గృహాల్లోకి వస్తున్న మురుగునీరు



ముక్కలుగా విరిగి ఒరిగిపోయిన డ్రెయినేజీ గోడ

తాడేపల్లిగూడెం అర్బన్: ప్రజారోగ్య కార్యక్రమాల్లో ప్రజల సౌకర్యార్థం పారిశుద్ధ్య, అభివృద్ధి పనుల్లో భాగంగా నిర్మించిన ప్రధాన డ్రెయినేజీ ముక్కలుగా విరిగి పక్కకు ఒరిగిపోవగడంతో మురుగు నీరు పారుదల నిలిచి ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోతుంది. స్థానిక బాపూజీ పుంత రహదారి సమీపంలో గతంలో మున్సిపాల్టీ ఆధ్వర్యంలో కాంక్రీట్ డ్రెయినేజీని నిర్మించారు. ఆ నిర్మాణం మూణ్నాళ్ల ముచ్చగానే ముగిసిపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు మురుగు నీరు ప్రవాహం కారణంగానో లేక మున్సిపల్ పారిశుద్ధ్య విభాగం డ్రెయినేజీల నుంచి సిల్టు తీయకపోడం వల్లనో, చెత్తాచెదారాలు, స్థానికులు పారేసిన చెత్త కారణంగానో ఇక్కడి డ్రెయినేజీ ముక్కలుగా విరిగి ఒరిగిపోయింది. దీంతో డ్రెయినేజీల్లో మురుగునీరు సమీపంలోని గృహాలకి, ఖాళీ స్థలాల్లోకి వచ్చి నిలుస్తుంది. అసలే వర్షాకాలం కావడంతో అటు వర్షపునీరు, ఇటు డ్రెయినేజీ నుంచి నివాస స్థలాలు, గృహాల్లోకి మురుగునీరు రావడంతో స్థానికులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

దోమలకు ఆవాసాలుగా..

పట్టణంలో ఖాళీ స్థలాలు ఉండడంతో మురుగునీరు వాటిల్లోకి చేరి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. ఈ ఖాళీ స్థలాల్లో రోజుల తరబడి మురుగునీరు నిల్వ ఉండడంతో దుర్వాసనతో పాటు, రాత్రి సమయాల్లో దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో డెంగీ, మలేరియా జ్వరాలు వ్యాప్తి చెంది ప్రజలు అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. మురుగు నీటి గుంటలు ఎక్కువగా పెరిగిపోవడంతో దోమలు విజృంభించాయి. దోమల నివారణకు తీసుకుంటున్న చర్యలు అనగా క్వాయిల్స్, ఆల్అవుట్ లాంటి వాటికి దోమలు ఏమాత్రం తగ్గడం లేదని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రెయినేజీకి మరమ్మతులు చేపట్టి మురుగునీరు ముందుకు పారేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

> **డ్రెయినేజీని పునరుద్ధరించండి**
>
> గతంలో నిర్మించిన ఈ డ్రెయినేజీ విరిగి ముక్కలుగా ఒరిగిపోవడంతో మురుగునీరు గృహాల్లోకి వచ్చి నిలిచిపోతుంది. దీంతో మురుగునీరు నిల్వ ఉండటం వలన పరిసరాలు దుర్వాసనతో పాటు దోమలు పెరిగిపోతున్నాయి. అధికారులు చర్యలు తీసుకుని డ్రెయినేజీని పునరుద్ధరించాలి.
>
> – ఆరేటి నాగేశ్వరరావు, స్థానికుడు, బాపూజీ పుంతరోడ్డు

ఘనంగా అన్నసమారాధన



కనకదుర్గమ్మ



అన్నసమావరాధనలో పాల్గొన్న భక్తులు

పెంటపాడు: దసరా ఉత్సవాలు పురస్కరించుకుని ప్రత్తిపాడు వై.జంక్షన్ కనకదుర్గమ్మ ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ఈవో జవ్వాది కృష్ణ, కమిటీ అధ్యక్షుడు మజ్జి అప్పారావు ఆధ్వర్యంలో అర్చకులు సుబ్రహ్మణ్యం అమ్మవారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు హాజరైన భక్తులతో ప్రత్యేక పూజలు చేయించారు. గ్రామంతో పాటు, చుట్టుపక్కల గ్రామాలనుంచి సుమారు 5వేల మంది భక్తులు అమ్మవారి ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆదివారం అమ్మవారిని భారీ దండలతో విశేషంగా అలంకరించారు. ఈ సందర్భంగా గత 13 రోజుల నుంచి నిర్వహిస్తున్న ఉత్సవాలు ముగించారు. తాడిపర్తి వీరాస్వామి, తూము చిన్న, మట్టా రాంబాబు, ఆరాధ్యుల అంజి తదితర గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు, చీరల పంపిణీ



సేవా కార్యక్రమంలో పాల్గొన్న ఫౌండేషన్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): పేరిచర్ల ఫౌండేషన్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. పేరిచర్ల ఫౌండేషన్ వ్యవస్థాపకులు మురళీకృష్ణంరాజు సహకారంతో ఆదివారం పట్టణంలోని పేదలకు దుప్పట్లు, చీరలు, బిర్యానీ పేకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో లయన్స్ క్లబ్ జిల్లా పూర్వ గవర్నర్ గట్టిం మాణిక్యాలరావును, ఉపాధ్యక్షుడు కాళ్ల గోపీకృష్ణ, మానసిక వైద్యులు పృథ్వీరాజ్‌లను శాలువాతో సత్కరించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్స్ ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్య పరిరక్షణ శిబిరం నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఆరోగ్య అలవాట్లు చేసుకోవాలని, ఒత్తిడి లేని జీవితం గడపాలన్నారు. యోగా గురువులు కరిబండి రామకృష్ణ, బడుగు చంద్రశేఖర్, ఇంద్రవాణి, కె.సుభద్ర, ఉమా మహేశ్వరీ, రాజా త్రినాద్, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ సేవలు అభినందనీయం

లయన్స్ క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. క్లబ్ ఆధ్వర్యంలో లయన్ మదన్‌మోహన్ అగర్వాల్ సహకారంతో పేదలకు నిత్యావసర వస్తువులు, ఆర్థిక సాయం అందజేశారు. అదే విధంగా తిమ్మరాజుపాలెం మానసిక వికలాంగుల వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఉదయం నుంచి సాయంత్రం వరకు అల్పాహారం, భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చిన్నం మణీంద్ర, ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, సుంకర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతో అన్యాయం



మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీటీసీ): ఎస్సీల్లో వెనకబడిన వారికి ప్రాధాన్యత ఇవ్వకుండా సుప్రీంకోర్టు మార్గదర్శకాలు పాటించకుండా చంద్రబాబు తన ఇష్టం వచ్చినట్లుగా ఎస్సీ వర్గీకరణ చేశాడని మాలలకు తీరని అన్యాయం జరిగిందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు పేర్కొన్నారు. పట్టణంలో ఆదివారం జరిగిన మాల మహానాడు సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ మాలలకు తక్కువ రిజర్వేషన్లు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఆధారంగా ఎస్సీ వర్గీకరణ జరగలేదని వాపోయారు. తెలుగు రాష్ట్రాల్లో దళితుల మీద దాడులు ఎక్కువయ్యాయని, ఎస్సీ రిజర్వేషన్లు పూర్తిగా తీసివేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని గుర్తించాలన్నారు. సమావేశంలో మాల సంఘాల నాయకులు గంటా సుందర్ కుమార్, పొట్ల విజయ కుమారి, జైపాల్, గొల్ల కిరణ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసు నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: పాత గొడవలను పురస్కరించుకుని దాడి కేసు నమోదైంది. మండలంలోని కృష్ణాపురం గ్రామంలో తోట కుమారిని అదే గ్రామా నికి చెందిన తోట లక్ష్మి ఆదివారం ఇటుకతో తలపై కొట్టి గాయపరిచింది. దీంతో బాధితురాలు కుమా రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని రూరల్ పోలీసులు తెలిపారు.

డిగ్రీ నుంచే ఉద్యోగాలు చేసుకుంటే మంచిది



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థులు డిగ్రీ చదువుతున్న సమయంలోనే పార్ట్ టైం ఉద్యోగాలు చేసుకుంటే ఆ సొమ్ము విద్యకు ఉపయోగపడడమే కాకుండా తల్లిదండ్రులకు ఆసరాగా కూడా ఉంటుందని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని చాంబర్స్ ఎడ్యుకేషన్ సొసైటీ స్వర్ణోత్సవ వేడుకల్లో ఈ–క్లాస్ రూమును ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ చదువుతో పాటు స్థానికంగా ఉండే మెడికల్, ఇంజనీరింగ్ వర్క్ షాపుల్లో పని చేస్తే స్కిల్స్ పెరుగుతాయని అన్నారు. తద్వారా చదువు పూర్తయిన అనంతరం అటువంటి వ్యాపారాలు సొంతంగా పెట్టుకోవచ్చన్నారు. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎంపీ పాకా సత్యనారాయణ పాల్గొన్నారు.

రాజ్యాంగం, న్యాయవ్యవస్థపై దాడి అమానుషం

ఆకివీడు: రాజ్యాంగం, న్యాయ వ్యవస్థపై దాడి చేసిన విధంగా ఇటీవల సంఘటనలున్నాయని సీబీసీఎన్‌సీ రాష్ట్ర కార్యదర్శి, ఫీల్డ్ కౌన్సిల్ కార్యదర్శి గూడపాటి జోసఫ్‌రాజు ఆవేదన వ్యక్తం చేశారు. అంబేడ్కర్ విగ్రహంపై పెట్రోల్ పోసి అంటించిన సంఘటనతో పాటు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడికి నిరసన వ్యక్తంచేస్తూ ఆదివారం స్థానిక ప్రధాన సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకంచేసి, పూలమాల వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ అందరివాడన్నారు. భారత రాజ్యాంగ నిర్మాతగా అన్ని వర్గాలకూ ఆయన సమాన ప్రాతినిధ్యంకల్పించారన్నారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఆయన తీసుకున్న నిర్ణయాలు మంచి ఫలితాలిస్తున్నాయన్నారు. అలాంటి వ్యక్తిని కించపరచే విధంగా పెట్రోల్ పోసి అంటించడం దారుణమైన సంఘటన అని మండిపడ్డారు. దీనిని ప్రతిఒక్కరూ ఖండించి, దుర్ఘటనకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడి చేయడం న్యాయవ్యవస్థను కించపరచడమేనన్నారు. న్యాయం, ధర్మాన్ని పరిరక్షించే న్యాయమూర్తులపై దాడి సహించరానిదన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జి.ఆనంద్, కృష్ణంరాజు, బి.వెంకటేశులు, మాణిక్యం, ఎలిషా, నాగేశ్వరరావు, ప్రభాకరరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రత్యేక బస్సుల ఏర్పాటు

తణుకు అర్బన్: కార్తీకమాసం సందర్భంగా తణుకు ఆర్టీసీ డిపో నుంచి పుణ్య క్షేత్రాలు, విహార యాత్రలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ సప్పా గిరిధర్ కుమార్ తెలిపారు. పంచారామాలకు ఈ నెల 26, వచ్చే నెల 2, 9, 16 తేదీల్లో రాత్రి 7 గంటలకు బస్సులు బయలు దేరి కార్తీక సోమవారం రోజున దర్శనాల అనంతరం తిరిగి తణుకు చేరుకుంటాయని వివరించారు. టికెట్ ధర పల్లె వెలుగు రూ.720, సూపర్ లగ్జరీ రూ.1200, ఏకాదశ రుద్రుల దర్శనం కోసం కార్తీక మాసంలో ప్రతి సోమవారం ఉదయం 6 గంటలకు తణుకులో బయలుదేరి 11 శైవ క్షేత్రాల దర్శనం అనంతరం అదే రోజు సాయంత్రం 6 గంటలకు తణుకు చేరుతాయని చెప్పారు. టికెట్ ధర కేవలం రూ.350 మాత్రమేనని, కార్తీకమాసంలో ప్రతి ఆదివారం మన్యసీమ విహార యాత్ర స్పెషల్ ఏర్పాటు చేశామని ఈ బస్సులు ఆదివారం ఉదయం 5 గంటలకు బయలుదేరి విహార యాత్ర అనంతరం రాత్రి 9 గంటలకు తణుకు చేరుతాయని స్పష్టం చేశారు. టికెట్ ధర పల్లెవెలుగు రూ.300, సూపర్ లగ్జరీ రూ.500, అలాగే విశాఖ విహార యాత్ర స్పెషల్స్ కూడా ఏర్పాటు చేశామని కార్తీకమాసంలో ప్రతి శనివారం రాత్రి 9 గంటలకు తణుకులో బయలుదేరి ఆదివారం విశాఖపట్నంలోని సుప్రసిద్ధ సందర్శనీయ విహారయాత్ర ప్రదేశాల దర్శనానంతరం సోమవారం ఉదయం తణుకు చేరుతాయని వివరించారు. టికెట్ ధర సూపర్ లగ్జరీలో పెద్దలకు రూ. 1050, పిల్లలకు రూ.800గా నిర్దేశించామని, అయ్యప్ప భక్తులకు శబరిమల, శివ భక్తులకు శ్రీశైలం అద్దె ప్రాదిపదికన వారు కోరిన చోట నుంచి బస్సులు ఇస్తామని వివరాలకు 73829 03287 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఉత్సాహంగా వారాహి అమ్మవారి గ్రామోత్సవం

యలమంచిలి: మండలంలోని మేడపాడు గ్రామంలోని కాలనీలో దసరా శరన్నవరాత్రులు సందర్భంగా ఏర్పాటుచేసిన వారాహి అమ్మవారి విగ్రహం నిమజ్జన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వినాయక సహిత అష్టలక్ష్మలతో ప్రత్యేకంగా తయారుచేసిన వాహనంపై వారాహి అమ్మవారిని పెట్టి గరగల నృత్యాలు, అమ్మవారి ఘటాలు, శక్తి వేషాలు, డీజే సౌండ్స్, యువతుల డాన్సాలు, బాణా సంచా కాల్పుల మధ్య అమ్మవారిని గ్రామమంతా ఊరేగించారు.

సంతకాల సేకరణను విజయవంతం చేయాలి



గరగపర్రులో మాట్లాడుతున్న నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ పీవీఎల్ నర్సింహరాజు.



గొల్లలకోడేరులో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పీవీఎల్ నర్సింహరాజు

పాలకోడేరు: వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ చేపడుతున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పీవీఎల్ నర్సింహరాజు పిలుపునిచ్చారు. గొల్లకోడేరు, గరగపర్రు గ్రామాల్లో పార్టీ కార్యాలయాల వద్ద మండలపార్టీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు, చెల్లబోయిన పాపారావు,చేకూరి నరేంద్రరాజుల ఆధ్వర్యంలో ఆదివారం సంబంధిత కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ మాజీ సీయం జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టితో ప్రతి జిల్లాకు మెడికల్‌కళాశాల తీసుకువస్తూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తమ అనుచరులు, బినామీలకు దోచిపెట్టేందుకు ప్రయత్నిస్తుందని మండిపడ్డారు. పీపీపీ విధానం అంటూ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తున్నారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ఈ నెల10 నుంచి నవంబర్ 22 వరకు రచ్చబండ కార్యక్రమం నిర్వహించి, సంతకాలు సేకరిస్తామని వివరించారు. ఈ నెల 23 నుంచి నియోజకవర్గకేంద్రంలో ర్యాలీలు, నవంబర్ 12న జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేస్తే మెరుగైన వైద్యం ఎలా అందుతుంది? ఆయన ప్రశ్నించారు.

కన్వీనర్లు, సోషల్ మీడియా అధ్యక్షుల ఎన్నిక

చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా అతి వృష్టి, లేకపోతే అనావృష్టి వచ్చి రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. అనంతరం గ్రామను బంధ విభాగాల కన్వీనర్లు,సోషల్ మీడియా అధ్యక్షులను ఎన్నుకున్నారు. ఈ సమావేశాల్లో పార్టీ మండల ఉపాధ్యక్షుడు చేకూరి రాజనరేంద్రకుమార్, జిల్లా ఎస్సీ సెల్ సభ్యుడు నామాల శ్యామ్‌కుమార్, నియోజకవర్గ బూత్‌కమిటీ కన్వీనర్ పాలా రాధాకృష్ణ, పాలా లక్ష్మీ, గొల్లలకోడేరు గ్రామాధ్యక్షుడు చిలువూరి గని గోపాలరాజు, సర్పంచ్‌లు కుక్కల లక్ష్మీ, బొల్లా శ్రీనివాస్, ఉపసర్పంచ్ నేతల సునీతసాల్మన్‌రాజు, ముదునూరి వెంకటరామరాజు(రాము), చింతలపాటి బలరామరాజు, గుంటపల్లి వెంకన్న, కముజు పండు, గరగపర్రు అబ్బులు, సత్యాల రోజమ్మ, గుత్తుల ఏడుకొండలు, గండి అనిల్‌కుమార్, పార్టీ అనుబంధ అధ్యక్షులు గాదిరాజు వీరభద్రరాజు, కోనాల రాజా, మత్తి సందీప్, పంది దివ్య, కుక్కల సత్యనారాయణ, నేతల సాల్మన్, నాయకులు అడబాల సత్యనారాయణ, గుబ్బల నరసింహారావు, మధు, ఏసు, శాంతారావు, నామాల సామేలు, గాడిపల్లి పెద్దిరాజు పాల్గొన్నారు.


కల్తీ మద్యాన్ని అరికట్టాలి



భీమవరంలో సీపీఎం సమావేశంలో మాట్లాడుతున్న వాసుదేవరావు

భీమవరం: రాష్ట్రంలో కల్తీ మద్యాన్ని అరికట్టి, మద్యా న్ని ఎమ్మార్పీ రేట్ల కంటే అధికంగా వసూలు చేస్తున్న షాపులపై తక్షణం చర్యలు తీసుకోవాలి సీపీఎం భీమ వరం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బి.త్రిమూర్తులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వాసుదేవరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక మద్యం ఏరులై పారుతుందని మండిపడ్డారు. స్పిరిట్‌తో పేదవారే లక్ష్యంగా కల్తీ మద్యం తయారు చేసి విచ్చల విడిగా విక్రయాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కల్తీమద్యం విక్రయాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులకు ముడుపులు అందుతున్నాయని ఆరోపించారు. కల్తీ మద్యం తాగి ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోయే ప్రమాదం ఏర్పడిందని వెంటనే కల్తీ మద్యం అరికట్టే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలోనే విస్తృతంగా బెల్ట్ షాపులు ఏర్పాటు చేయించి ప్రజలతో బలవంతంగా మద్యం తాగిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఆరోగ్యశ్రీ నిధులు నిలుపుదల చేయడంతో హాస్పిటల్స్‌లో వైద్యం, సరైన సౌకర్యాలు అందట్లేదని, పేదలపై వైద్యం ఖర్చులు మరింత దారుణంగా పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రాష్ట్రంలో కల్తీ మద్యం అరికట్టకపోతే ఎక్సైజ్ ఆఫీసుల వద్ద ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం నాయకులు ఎం.వైకుంఠరావు, డి.నాగేశ్వరరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, కె.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాయిపేటలో సమస్యల తిష్ట



పిచ్చి మొక్కలు పెరిగిపోయి అధ్వానంగా ఉన్న జీజీబీఎస్ మహిళా కళాశాల రోడ్డు

నరసాపురం: పట్టణంలోని రాయిపేటలో మౌలిక వసతుల సమస్య నానాటికీ తీవ్రమవుతోంది. ఎప్పటికప్పుడు అభివృద్ధి పనులు చేశామని చెప్పుకోవడమే తప్ప, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితి ఏ విధంగా ఉందో రాయిపేటను చూస్తే అర్థమవుతుంది. పైగా పట్టణంలో రాయిపేటను ప్రధానమైన ప్రాంతంగా చెప్పుకుంటారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో డ్రెయిన్స్, పారిశుద్ధ్య సమస్యలు చాలా కాలంగా పరిష్కారం కావడం లేదు. ఇటీవల ఈ సమస్య మరింత తీవ్రమైంది. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

వేధిస్తున్న డ్రెయిన్ల సమస్య

రాయిపేట మొత్తంగా ఎక్కడాకూడా డ్రెయిన్స్ సవ్యంగా లేవు. పూర్వం నిర్మించిన డ్రెయిన్లు శిథిలమయ్యాయి. అవుట్‌లెట్స్ సరిగ్గాలేవు. దీంతో మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది. అదీకాక ఈ ప్రాంతంలో ఈ మధ్యకాలంలో ఒక్క మేజర్ డ్రెయి న్ కూడా కొత్తగా నిర్మించలేదు. మరోవైపు పాత డ్రెయిన్స్ లెవెల్స్ సరిగా లేకపోవడంతో పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. ప్రతి డ్రెయిన్ లోనూ మురుగు, రోడ్డుమీదకు ప్రవహిస్తోంది. కొత్త డ్రెయిన్స్ నిర్మించాలని స్థానికులు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నా పట్టించుకునే వారే లేరు. ఆర్డీఓ, డీఎస్పీనుంచి ఇతర ఉన్నతస్థాయి అధికారులు, బడా కాంట్రాక్టర్లు, పెద్ద వ్యాపారులు అత్యధికంగా ఈ ప్రాంతంలోనే నివాసం ఉంటున్న పరిస్థితి మాత్రం దారుణంగా ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. రాయిపేటలో ప్రతిచోటా 60 అడుగుల వెడల్పుతో విశాలమైన రోడ్లు ఉంటాయి. అయితే రోడ్లకు ఇరువైపులా పిచ్చిమొక్కలు, చెత్తకుప్పలు దర్శమిస్తుంటాయి. పైగా ఇటీవల రోడ్లపై పందులు సంచరిస్తున్నాయి. మరోవైపు కుక్కల బెడదతో స్థానికులు బెంబేలెత్తుతున్నారు. వీధిలైట్లు కూడా సవ్యంగా వెటగడం లేదు. రాత్రయితే దొంగల భయంతో వణికిపోతున్నామని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధు లు స్పందించి రాయిపేటలో సమస్యలను పరిష్కరించాలని పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు.

ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

భీమవరం: వీఓఏలను భయపెట్టడానికి పాలకులు తీసుకొచ్చిన కాల పరిమితి సర్క్యులర్‌ను అనేక పోరాటాలు చేసి రద్దు చేయించుకున్నామని వీఓఏల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నిర్మలాదేవి అన్నారు. ఆదివారం భీమవరం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వీఓఏలకు కనీస వేతనాలు పెంచాలని, పని ఒత్తిడి తగ్గించాలని, సెల్ ఫోన్స్ ఇవ్వాలని తదితర సమస్యలపై చాలా కాలంగా పోరాటాలు నిర్వహిస్తున్నామని గుర్తు చేశారు. అయితే కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయడానికి ఇంత సమయం పట్టిందని చెప్పారు. మిగిలిన సమస్యలు కూడా తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.ఆంజనేయులు, జిల్లా అధ్యక్షురాలు గోవిందమ్మ, సీఐటీయూ జిల్లా నాయకులు ఇంజేటి శ్రీనివాస్, దుర్గాదేవి పాల్గొన్నారు.